క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ డీఈసీ మాత్రలు

విజయనగరం ఫోర్ట్: డీఈసీ మాత్రలు ప్రతి ఒక్కరికీ అందజేసి వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సాయినాథ్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి రోహిత సాగాంబిక అన్నారు. స్థానిక సాయినాథ్ కాలనీలో రెండు రోజుల కిందట పంపిణీ చేసిన డీఈసీ మాత్రలు, అల్బెండజోల్ మాత్రలు ప్రజలు వేసుకున్నది లేనిది బుధవారం పరిశీలించారు. ఫైలేరియా, రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ మాత్రలు పంపిణీ చేసిందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

రొటేషన్ పద్ధతిలో పని



సూపరింటెండెంట్ పరమేశ్వరరావుకు వినతినిస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం టౌన్: ఆర్టీసీ డిపో ఆవరణలో పనిచేస్తున్న స్వీపర్లకు సర్క్యులర్ ప్రకారం జీతం రూ. 9250 చెల్లించడంతో పాటు రొటేషన్ పద్ధతిలో అందరికీ పని కల్పించాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్‌మోహన్‌రావు, బి.రమణ కోరారు. ఈ మేరకు డిపో సూపరింటెండెంట్ పరమేశ్వరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, కార్మికుల సంఖ్య పెరగకపోవడంతో పనిభారం ఎక్కువవుతోందన్నారు. రొటేషన్ పద్ధతిలో కార్మికులందరికీ పని కల్పించాలని సూపర్‌వైజర్‌ని కోరినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు శంకరరావు, రంగమ్మ, వెంకట్, లక్ష్మీభవాని, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గొర్లిపేట జగనన్న కాలనీలో ఎంపీడీఓ గిరిబాల బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి బోరు ఏర్పాటుకు జరుగుతున్న తవ్వకాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. తాగునీరు, రహదారి సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పరిశినాయుడు, రాంబార్కి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం



ర్యాలీ చేస్తున్న రైతులు, వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం విభాగం ప్రతినిధి వి.మహేష్ అన్నారు. నవధాన్యాల వేద్దాం – నేలతల్లిని కాపాడుకుందాం అనే నినాదంతో రైతులు, ఉపాధి హామీ వేతనదారులతో గుంకలాంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి పంట సాగు చేయడానికి 45 రోజుల ముందు నవధాన్యాలను సాగు చేయాలన్నారుర. ఎకరానికి 13 కిలోల చొప్పున విత్తనాలు వేసుకోవాలని సూచించారు. వీటిని బాగా కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు.కార్యక్రమంలో వీఏఏ శోభ, క్షేత్ర సహాయకుడు గణేష్ పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ కాలువ నిర్మాణ పనులు



కాలువ నిర్మాణానికి తీస్తున్న గుంతలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేటలో సీసీ కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పంచాయతీ నిధులతో బీసీ కాలనీ నుంచి గెడ్డ వరకు కాలువల నిర్మాణం కోసం జేసీబీతో బుధవారం గుంతలు తీసి పనులు ప్రారంభించారు. వారం రోజుల్లో కాలువ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని వైఎస్సార్‌సీపీ నేత లెంక గోవింద తెలిపారు. కాలువల నిర్మాణం చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

గుర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం నిర్వహించ నున్నట్లు ఎంపీడీఓ కల్యాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

గాడినపడ్డారు..



ఏపీ ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేసుకుంటున్న ఉద్యోగి

- ఏపీ ఎఫ్ఆర్ఎస్ అమలుతో సమయానికి హాజరవుతున్న ఉద్యోగులు
- ప్రజలకు అందుబాటులో అధికారులు
- విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 344కు పైగా ఉద్యోగులు

సమయపాలన పాటించాల్సిందే..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలి. ఇందు కోసం ఏపీ ఎఫ్ఆర్ఎస్ పేరిట ప్రత్యేక యాప్ రూపొందించారు. ఆ యాప్‌లో రిజిస్టర్ చేసుకుని కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి హాజరు నమోదు చేసుకోవాలి. లేని పక్షంలో ఆ రోజు హాజరు నమోదు చేయబడదు. సిబ్బంది సమయానికి వస్తుండడంతో ప్రజా సమస్యలు త్వరగా పరిష్కామవుతున్నాయి.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

విజయనగరం: ఒకప్పుడు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళితే అధికారులు ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళ్లిపోతారో.. తెలియని పరిస్థితి. అసలు వస్తారో... రారో...! కూడా తెలియదు. దీంతో చిన్నపాటి పని కోసం రోజుల తరబడి ప్రదక్షణలు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం పరిస్థితి మారింది. అధికారి నుంచి దిగువస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత సమయానికి కార్యాలయాల్లో అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వం అమలుచేస్తోన్న ఏపీఎఫ్ఆర్ఎస్ యాప్‌తో ఉద్యోగులంతా నిర్ణీత సమయానికి కార్యాలయానికి చేరుకుంటున్నారు. మరలా సాయంత్రం నిర్దేశించిన సమయం వరకు కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నారు. విజయనగరం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారుల నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు అధికారిక లెక్కల ప్రకారం 344 మంది ఉద్యోగులు ఉన్నారు. వారంతా ప్రభుత్వం అమలు చేస్తోన్న ఏపీ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో రిజిస్టర్ అయ్యారు. యాప్ ద్వారా హాజరు వేయడాన్ని పక్కాగా అమలు చేస్తుండడంతో ఉద్యోగులందరూ



కార్పొరేషన్ కార్యాలయం

విధిగా నిర్ణీత సమయానికి వస్తున్నారు. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి వచ్చి మొబైల్ ఫోన్‌లలో హాజరు నమోదు చేసుకుంటున్నారు. తిరిగి సాయంత్రం ఐదు గంటల తర్వాత మరోసారి హాజరు వేసుకుంటున్నారు. రెండు సమయాల్లో ఏ ఒక్కసారి హాజరు వేసుకోకపోయినా, ఆలస్యమైనా, ముందుగా వెళ్లిపోయినా రిమార్కులు నమోదవుతాయి. దీంతో ఉద్యోగులంతా కాస్త ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వ నూతన విధానాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా నగర ప్రజలకు సేవలందించడంలో విజయనగరం కార్పొరేషన్ కీలకపాత్ర పోషిస్తోంది. ప్రధానంగా ఓ వ్యక్తి జననం నుంచి మరణం వరకు అన్ని సమయాల్లో సేవలందించాల్సింది కార్పొరేషన్ ఉద్యోగులే. ఈ నేపథ్యంలో నిత్యం వందలాది మంది కార్యాలయానికి వివిధ కార్యకలాపాల నిమిత్తం వచ్చిపోతుంటారు. ప్రధానంగా పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, సొంతింటి నిర్మాణ ప్లాన్‌ల కోసం ఇలా వివిధ అవసరాల వస్తుండగా సిబ్బంది అందుబాటులో ఉండడంతో వారి పనులు త్వరితగతిన పూర్తవుతున్నాయి. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధం అంతంతమాత్రమే..



రహదారి పక్కన పోగులుపడిన ప్లాస్టిక్ వ్యర్థాలు



(ఇన్‌సెట్లో)వేణుగోపాలపురం జంక్షన్‌లో ఓ రెస్టారెంట్‌లో వినియోగిస్తున్న పాలిథిన్ కవర్లు

- నగర పంచాయతీలో విచ్చలవిడిగా పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగం

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధం అంతంతమాత్రంగానే అమలవుతోంది. గతేడాది జూలై 1వ తేదీ నుంచి ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల వినియోగం, విక్రయాలను ప్రభుత్వం నిషేధించింది. నిర్ణీత మైక్రాన్ల మందం కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, కప్పులను నిషేధించారు. అయితే నగరంలో నిషేధం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ హోటళ్లు, రెస్టారెంట్లు, కూరగాయల దుకాణాలు, కిరాణా షాపుల్లో యథేచ్ఛగా పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్నారు. పట్టణ ప్రధాన రహదారిలోని అన్ని షాపుల్లోనూ పాలిథిన్ కవర్లు వాడుతున్నారు. అలాగే జరజాపుపేటలోని అన్ని షాపుల్లోనూ యథేచ్ఛగా పాలిథిన్ కవర్లు, బ్యాగులు దర్శనమిస్తున్నాయి. ఆ ప్రాంతంలో నిషేధం మాటే కానరావడం లేదు. పట్టణ ప్రధాన రహదారిలో పలుచోట్ల ప్లాస్టిక్‌తో తయారు చేసిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను నగర పంచాయతీ అధికారులు బేఖాతరు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా పట్టణంలో ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధం అమలు చేస్తున్నామన్నారు. ఎవరైనా వినియోగించినా, విక్రయించినా తమకు ఫిర్యాదు చేయాలని కోరారు.

పౌష్టికాహారం తప్పనిసరి

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. మండలంలోని ఒమ్మి సచివాలయంలో పలువురు లబ్ధిదారులకు పౌష్టికాహార కిట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రసవానికి ముందు ప్రసవానికి తర్వాత మహిళల్లో రక్తహీనత లోపం అధికంగా ఉంటుందన్నారు. గర్భిణులు, బాలింతలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తోందని తెలిపారు.



పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు

కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'థమ్సప్ పాప' ఆల్బమ్ విడుదల

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో చిత్రీకరించిన 'థమ్సప్ పాప' ఆల్బమ్ పాటను గురువారం ఆ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విద్యతోపాటు విద్యార్థుల్లో ఉన్న కళలను యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. యూట్యూబ్‌లోని ఆర్‌డీఎస్ చానల్‌లో ఆల్బమ్ విడుదల చేసినట్లు నృత్య దర్శకుడు రితిక్ మాస్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంగీత దర్శకులు ప్రియతం భరద్వాజ్, గాయకులు ప్రశాంత్, హీరో శివ, హీరోయిన్ ధనశ్రీ, సహాయకులు రామ్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

బ్యాంకర్లు సహకరించాలి

- డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు కల్యాణ చక్రవర్తి, సుధాకర్

నెల్లిమర్ల: మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించడానికి బ్యాంకర్లు సహకారం అందించాలని డీఆర్‌డీఏ పీడీ ఎ. కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ బి. సుధాకర్ కోరారు. నెల్లిమర్ల పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ బ్రాంచ్‌లో బుధవారం నిర్వహించిన జేఎంఎల్‌బీసీ సమావేశంలో భాగంగా డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఏపీజీవీబీ సతివాడ బ్రాంచ్ మేనేజర్ కె. షణ్ముఖరావును సత్కరించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, జగనన్న తోడు, తదితర రుణాలను మహిళలకు అందించడంలో బ్యాంకులు విశేషంగా కృషి చేస్తున్నాయని కొనియాడారు. భవిష్యత్‌లో కూడా సంఘాలు, సభ్యులకు ఎక్కువ మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎల్‌డీఎం శ్రీనివాస్, వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కో ఆర్డినేటర్ సీతారామయ్య, ఏపీఎం సత్యనారాయణ, బ్యాంక్ లింకేజీ డీపీఎం బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.



షణ్ముఖరావును సత్కరిస్తున్న పీడీలు కల్యాణచక్రవర్తి, సుధాకర్

శతశాతం పన్నులు వసూలు చేయాలి

- కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు

విజయనగరం: ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు అన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్ను బకాయిల వసూళ్లపై బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సిబ్బందితో పాటు, వార్డు సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ డివిజన్ల వారీగా వసూళ్లపై ఆరా తీశారు. పలు డివిజన్‌లలో పన్నుల వసూళ్ల ప్రక్రియ మందకొడిగా సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొండి బకాయిలను వసూలు చేయాలని లేని పక్షంలో తీసుకోబోయే చర్యలపై చెల్లింపుదారులకు వివరించాలని సూచించారు. అలాగే నీటిపన్ను వసూళ్లలో నిర్లక్ష్యం విడనాడాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించారు. ఇప్పటివరకు పన్ను బకాయిదారులకు ఇచ్చిన నోటీసులు ఎన్ని.. కుళాయి కనెక్షన్లు తొలగించారా, లేదా అన్న అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ, 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను వసూలు లక్ష్యం 43 కోట్ల 49 లక్షల 26 వేల రూపాయలు కాగా, ఇప్పటివరకు 22 కోట్ల 72 లక్షల 54 వేల రూపాయలు వసూలు చేసినట్లు తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయం దగ్గర పడడంతో పన్ను వసూళ్లను ముమ్మరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలందరూ పన్నులను సకాలంలో చెల్లించి, నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. పెద్ద మొత్తంలో పన్ను బకాయలు ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే వారి ఆస్తులను జప్తు చేయాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, సాయి ప్రసాద్, వినోద్, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు


18న మహాశివరాత్రి

విజయనగరం టౌన్: నిత్య దైవనామస్మరణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న శ్రీమాన్ నారాయణ స్వామీజీ ఆశ్రమ ప్రాంగణంలో మహాశివరాత్రి మహోత్సవం నిర్వహించనున్నట్లు సమితి ప్రధాన కార్యదర్శి పి.ఉమాశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు ప్రసాద వితరణ, అనంతరం సేవా సమితి వారిచే సామూహిక నామస్మరణ, తాళాబత్తుల అమ్మాజీతో భక్తి గానాలాపన, నారాయణ నృత్యాలయం వారితో 'శివతాండవం' వంటి సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసు విచారణ

విజయనగరం రూరల్: మండలంలోని జొన్నవలసలో ఈ నెల 13న ఓ స్థలం విషయంలో జరిగిన ఘర్షణలో మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ కోరాడ నారాయణరావును కులం పేరుతో దూషించడంతో పోలీసులు సదరు వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు జొన్నవలస గ్రామాన్ని బుధవారం సందర్శించి బాధితుడుతో పాటు సాక్షులను విచారించారు.

పరిశీలన



భోజనాన్ని రుచి చూస్తున్న డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు

పూసపాటిరేగ: మండలంలోని పసుపాంజెడ్పీ హెచ్ పాఠశాలను డిప్యూటీ డీఈఓ కె.వాసుదేవరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వండిన వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

శివరాత్రికి ప్రత్యేక సర్వీసులు

శృంగవరపుకోట: మహాశివరాత్రి జాతర సందర్భంగా ఈనెల 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్ నుంచి పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంకు ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ బుధవారం తెలిపారు. 18న 20 సర్వీసులు, 19న 15 సర్వీసులు డిపో నుంచి పుణ్యగిరి, సన్యాసయ్యపాలెంకు నడుస్తాయని పేర్కొన్నారు. పుణ్యగిరి వెళ్లే భక్తులు ఆర్టీసీ డిపోలో లేదా, పుణ్యగిరి రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం వద్ద బస్సులు ఎక్కవచ్చన్నారు. సన్యాసయ్యపాలెం వెళ్లే భక్తులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో లేదా ధర్మవరం రోడ్డులో పాతబస్టాండ్ వద్ద బస్‌లు ఎక్కవచ్చని వివరించారు. పుణ్యగిరికి రూ.10, సన్యాసయ్యపాలెంకు రూ.20 చార్జీ వసూళ్లు చేస్తామని, ప్రతి 5 నిముషాలకు ఒక ఆర్టీసీ బస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రం అందజేస్తున్న జేసీ మయూర్ అశోక్

- జేసీ మయూరి అశోక్

దత్తిరాజేరు: ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతం కృషి చేయాలని జేసీ మయూర్ అశోక్ సూచించారు. పోరలి ఉన్నత పాఠశాలలో గతేడాది పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పోరలి గ్రామానికి చెందిన, ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కర్ణాటకలోని ఉడిపి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న మిత్తిరెడ్డి కూర్మారావు ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతు కుటుంబంలో పుట్టి ఈ పాఠశాలలో చదువుకుని కలెక్టర్ అయిన కూర్మారావును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పదోతరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఆర్.గాయత్రికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎం.మణికి రూ.4 వేలు, తృతీయ స్థానం సాధించిన పి.నరేంద్రకు రూ.3 వేలు, నాలుగు, అయిదో స్థానాల్లో నిలిచిన పి.వంశీ, ఏ.రామకృష్ణకు రూ.2 వేలు చొప్పున నగదు అందజేశారు. అంతకుముందు పాఠశాలలో తరగతి గదులను, కంప్యూటర్ ల్యాబ్‌ను జేసీ పరిశీలించారు. ఎంఈఓ వెంకటరావు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్, హెచ్ఎం రాము నాయుడు పాల్గొన్నారు.

86 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

గజపతినగరం: గజపతినగరం నియోజకవర్గంలో రైతుల నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 86 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంకా రైతుల వద్ద ధాన్యం నిల్వ ఉంటే ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని, ఈ మేరకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని చెప్పారు. గతంలో జిల్లాలో 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చేదని, ఈఏడాది 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వచ్చిందని, అందులో 75 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందని వివరించారు. లక్ష్యాలకు అనుగుణంగా విడతల వారీగా ధా న్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులెవరూ అధైర్య పడాల్సిన పని లేదని, ఆలస్యం అయినా ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు.

చంద్రబాబువి హత్యారాజకీయాలు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ తప్పుడు కథనాలతో పుస్తకాలను విడుదల చేయడం తగదని ఎమ్మెల్యే అన్నారు. హత్యారాజకీయాలకు తెరలేపింది చంద్రబాబునాయుడేనని, ఆయన చేయించిన రాజకీయ నాయకుల హత్యలను వివరించారు. హత్యారాజకీయాలకు చంద్రబాబు మారుపేరని, ఆయన కుటిల రాజకీయాలను టీడీపీ వారు తెలుసుకోవాలని హితవు పలికారు. జరిగినవి జరగనట్లు, జరగనవి జరిగినట్లుగా ఎల్లో మీడియా తప్పుడు కథనాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

రాయడం, ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. నియోజకవర్గంలో 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమాన్ని 75శాతం పూర్తి చేశామని, దానిని కూడా వక్రీకరించి కొన్ని పత్రికలు కథనాలు రాయడం సబబు కాదని, తనపై ఏమైనా రాసేటప్పుడు తన అభిప్రాయం తీసుకుంటే బాగుండేదని అన్నారు. తనపై తప్పుడు కథనాలు సృష్టించినంత మాత్రాన తనకేమీ కాదని, విలువను కోల్పోయేది రాసే పత్రికలేనని తెలుసుకోవాలని హెచ్చరించారు.

పారదర్శకంగా పథకాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. మార్చి 18వ తేదీ నుంచి గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లు గడప గడపకూ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు మధ్య వ్యత్యాసాలను ప్రజలకు వివరించనున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టభద్రులను కోరారు. పార్టీ సీనియర్ నాయకుడు, పురిటిపెంట వైస్ సర్పంచ్ మండల సురేష్, కె.రామునాయుడు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీపురుపల్లి: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. మంగళవారం రాత్రి స్థానిక ఆంజనేయపురం ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడిపేన బలరాం, ప్రధాన కార్యదర్శిగా దువ్వాడ కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడిగా మామిడి శ్రీను, గౌరవ సలహాదారుడిగా గిడిజాల లక్ష్మునాయుడు, సహధ్యక్షులుగా మజ్జి భారతి, వై.వి.రమణ, కోశాధికారిగా ఎస్.సురేష్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా యు.వినోద్, సహకార్యదర్శులుగా బి.జయరాం, ఎ.ప్రియాంక, ఎం.సత్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.రాష్ట్ర కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆలుమూరి సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

28లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

చీపురుపల్లి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అంతా ఈ నెల 28లోగా తమ జీవన ప్రమాణ పత్రాలను స్థానిక ఉపఖజానాశాఖ కార్యాలయానికి అందజేయాలని ఏపీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంపోలు సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. విశ్రాంత ఉద్యోగులు అంతా తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని , సీఎఫ్ఎంఎస్ నంబర్‌తో ఆధార్, ఫోన్ నంబర్ లింక్ చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్స్ సమర్పించే సమయంలో పాన్, ఆధార్ లింక్ తప్పనిసరి అని, అందుచేత పాన్, ఆధార్ లింక్ కూడా చేయించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జీవన ప్రమాణ పత్రాలకు సంబంధించిన వివరాలు నమోదు సబ్ ట్రెజరీ కార్యాలయంతో పాటు విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో కూడా చేస్తున్నట్లు వివరించారు.